పేదలకు నాణ్యమైన విద్యే సీఎం జగన్ లక్ష్యం

- జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు
- విద్యార్థులకు జగనన్న విద్యా కిట్ల అందజేత



గోపాలపట్నం బాలుర పాఠశాలలో విద్యా కానుకలు అందిస్తున్న బెహరా భాస్కరరావు



గవర వీధి పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు అందిస్తున్న జ్యోత్స్న

గోపాలపట్నం: పేదలకు నాణ్యమైన విద్యానందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఆర్‌హెచ్ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న విద్యా కానుకలను ఆయన బుధవారం అందించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో విద్యా వ్యవస్థనే భ్రష్టు పట్టించారన్నారు. చాలా పాఠశాలలు మూసివేశారని దుయ్యబట్టారు. డిజిటల్ బోర్డులు తామే ఇచ్చామని చెప్పుకుంటున్న నాయకులు ఇంత వరకు ఆ బోర్డులు పాఠశాల ముఖమైనా చూడలేదని విమర్శించారు. నాడూ–నేడూ పనుల ద్వారా పాఠశాలలను సీఎం జగన్ అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. వాటిని చూసైనా ప్రతిపక్షంలో మార్పు రావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఎస్తేర్ హెప్సిబా ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, కంపర కోటేశ్వరరావు, గొంతిన నాగరాజు, సీరపు శంకరరావు, కంపర సత్తిబాబు, బాబూరావు మాస్టారు, వంగలపైడి రాజమణి, మహేష్, సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జగనన్న స్కూల్ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ లావణ్య

91వ వార్డులో..

జీవీఎంసీ 91వ వార్డు గవర వీధి జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాలలో కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్ వంటి కిట్లు అందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏడాది మరింత మెరుగ్గా విద్యా కానుకలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపధ్యాయురాలు భవానీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మన కోసం శ్రమిస్తున్న సీఎం జగన్

మల్కాపురం : పేదలకు ఉన్నత విద్యను చేరువ చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కార్పొరేటర్ గులిగిందల లావణ్య అన్నారు. జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం వద్ద గల జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కిట్ల పంపిణీ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ముఖ్య అతిథిగా పాల్గొని పలు తరగతుల విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలలో ఉన్న చీకటిని తొలగించి, వారికి వెలుగులు పంచటమే పనిగా మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని అన్నారు. జగనన్న ముందు చూపుతో విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చి, ప్రతి పేద వానికి కార్పొరేట్ విద్య అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే శ్రీహరిపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు స్థానికంగా గల పలువురు చిన్నారులు పోటీ పడ్డారు. వీరంతా బుధవారం పాఠశాల వద్దకు అడ్మిషన్ల కోసం వచ్చారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు, కార్పొరేటర్ లావణ్య అడ్మిషన్లు అందించారు.



పాఠశాలలో చేరేందుకు అడ్మిషన్లు తీసుకుంటున్న తల్లిదండ్రులు

40వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామం జీవీఎంసీ హైస్కూల్‌లో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పంపిణీ చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కూడా అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి చంటిబాబు, సచివాలయ కన్వీనర్ మీసాల సత్యనారాయణ, సచివాలయ గృహసారధి అన్నెపు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయానికి ఇన్వర్టర్ అందజేత



ఇన్వర్టర్ కిట్‌ను తహసీల్దార్ వీరభద్రరావుకు అందిస్తున్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయానికి ఇన్వర్టర్‌ను కోరమాండల్ అధికారులు బుధవారం అందజేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే కార్యాలయంలో అంధకారం అలముకోవడంతో పాటు కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుంది. ఈ సమస్య తెలుసుకున్న కోరమాండల్ అధికారులు సీఎస్ఆర్ నిధుల నుంచి సమకూర్చిన ఇన్వెర్టర్‌ను తహసీల్దార్ వీరభద్రరావుకు అందజేశారు. కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు ఎస్.వెంకటరావు,ఎం.సందీప్‌కుమార్,ఎస్.శ్రీధర్,వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: స్థానిక 30 పడకల ఆస్పత్రిని బుధవారం ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. వార్డులోకి వెళ్లి రోగులతో మాట్లాడారు. సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఓపీ రోగులు కూర్చునేందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జన్‌భాగీదరిపై అవగాహన



అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 'జన్ భాగీ దరి ' కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆట–పాటలతో కూడిన విద్య అందించడం జరుగుతుందని అంగన్‌వాడీ టీచర్ టి.విజయలక్ష్మి తెలిపారు. అనంతరం ఆర్పీపేట పాఠశాల ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జానకి, వరలక్ష్మి, రాజ్యలక్ష్మి, బుజ్జమ్మ, నీలవేణి, కుమారి,తల్లులు, చిన్నారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి పరిహారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మృతి చెందిన కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి సాయం అందించడానికి కాంట్రాక్టర్ అంగీకరించారు. మంగళవారం రాత్రి స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో సిద్దేశ్వరానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు గొందేశి రాజు మృతి చెందాడు. ఈ అంశంపై బుధవారం హెచ్‌ఆర్ డీజీఎం రాధిక సమక్షంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్ జరిపిన చర్చల్లో కాంట్రాక్టర్ నష్టపరిహారం కింద రూ.1.5 లక్షలు, దహన ఖర్చుల కింద రూ. 25 వేలు చెల్లించడానికి అంగీకరించారు. వీటితో పాటు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు, వర్క్‌మెన్ కాంపెన్సేషన్ రూ.10 నుంచి 13 లక్షలు, లేబర్ వెల్ఫేర్ ఫండ్ రూ. 2 లక్షలు, పీఎఫ్, ఈడీఎల్ కింద నష్టపరిహారం వచ్చేటట్టు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి రవిచంద్ర బాబు, వివిధ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు మంత్రి రవి, నందికి తాతారావు, పిట్టా రెడ్డి, నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, గొందేశి సత్యారావు, కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు తిప్పల చక్రధర్‌రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పార్టీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిలేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆడపడుచులకు అన్నివిధాల తోడ్పడుతున్నారని తెలిపారు. ఆరోగ్య భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గవర రమణ, ప్రమీల, పవన్‌కుమార్, దాసు, విజయ్, మధు, జ్యోతి, ఉష, ఆదిలక్ష్మి, దేవి, కనకమహాలక్ష్మి తదతరులు పాల్గొన్నారు.



మహిళలకు సీమంతాలు నిర్వహిస్తున్న స్థానిక మహిళలు, పార్టీ నాయకులు

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం , శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వామిని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్తున్న అర్చకులు

'కేంద్ర నిర్ణయంతో కార్మికులకు అన్యాయం'

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో తీసుకుంటున్న నిర్ణయాలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 853వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే మాత్రం హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు ఇక సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



853వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

హెల్త్ సూపర్‌వైజర్లకు ఆత్మీయ వీడ్కోలు

సీతంపేట: నగరంలోని జిల్లా మలేరియా సబ్ యూనిట్ నుంచి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిన ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లకు సహోద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) వై.మణి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కె.వెంకటరావు, ఆర్.వి.లోకనాథం, బి.ఎస్.వర్ధన్ సబ్‌యూనిట్‌లో మంచి సేవలు అందించారని, భవిష్యత్‌లో కూడా అదేవిధంగా సేవలందించాలని కోరారు. అనంతరం వారిని దుశ్శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన మరో ముగ్గురు సూపర్ వైజర్లు సత్యానందం, జి.వి.రవికుమార్, రామి నాయుడులకు సాదరంగా ఆహ్వానం పలికారు. సూపర్ వైజర్లు బి.కుమార్, రత్నం, రామకోటి పాల్గొన్నారు.

టాపర్లకు పురస్కారాల ప్రదానం నేడు

మల్కాపురం: ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా గురువారం సత్కరించనున్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఉదయం 8.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ సూక్ష్మ,చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, డీఈవో చంద్రకళ,వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని విద్యార్దుర్థులను అభినందిస్తారు. ప్రశంసా పత్రాలు అందజేస్తారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ ప్రాంతానికి చెందిన క్యాన్సర్ రోగికి స్థానిక పి.వి.ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు అండగా నిలిచారు.రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ట్రస్టు ప్రతినిధి, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ చేతుల మీదుగా బుధవారం అందించారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఏఎంసీలో రక్తదాన శిబిరం



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజుకు స్వాగతం పలుకుతున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. మెడికల్ కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.బుచ్చిరాజు ప్రారంభించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, వైద్యులు టీవీఎస్ నాయుడు, ఎస్.చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో జరిగిన వైద్య శిబిరంలో 104 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏక్యూజే ప్రసన్నకుమార్, నర్మద చంద్ర, టి.కీర్తిశ్రీ, దొడ్డి ఉదయశ్రీ, కీర్తి సుబ్రహ్మణ్య, సుమిత పోలవరం, అల్లు సాయి మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ పండగకు వేళాయె

- కార్మికుల విరాళాలతో గుడి నిర్మాణం
- దేశ విదేశాల నుంచి హాజరు కానున్న భక్తులు



మరిడిమాంబ అమ్మవారు



ఆలయంలో ప్రతిష్ఠించిన మహాశివుని విగ్రహం



ఉత్సవాల సందర్భంగా ముస్తాబైన ఆలయం

సింధియా: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కీర్తిగడించిన సింధియా మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి దశాబ్దాల చరిత్ర ఉంది. అప్పటి నుంచి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారి ప్రధాన పండగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర

దేశంలో మొట్టమొదటి నౌకా నిర్మాణ సంస్థ సింధియా నేవిగేషన్ కంపెనీగా పేరుగాంచిన నేటి హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ ముఖద్వారం ఎదుట అమ్మవారు వెలసిందని పూర్వీకుల విశ్వాసం. ఇప్పటి నేవల్ డాక్‌యార్డ్ అప్రంటీస్ స్కూల్ ప్రహరీని ఆనుకుని అమ్మవారి పుట్టమన్ను స్థలం ఉంది. అప్పట్లో రైలు మార్గం గుండా షిప్‌యార్డ్ నిర్మాణానికి వచ్చే ఉత్పత్తులకు మొదట అమ్మవారి మందిరం వద్ద పూజలు చేసేవారని చెబుతుంటారు. రైలు మార్గం గుండా తరలివచ్చే కూరగాయలు, పలు రకాల ముడి సరుకులు నగరంలోని పాతపోస్టాఫీస్‌కు తరలించేందుకు దుర్గాబీచ్ నుంచి ఫెర్రీ(నీటిపై తేలియాడే తాళ్లతో కట్టిన కర్రల వంతెన) ద్వారా తరలించేవారు. అప్పట్లో సింధియా నేవిగేషన్ కంపెనీలో సుమారు 5వేల మంది కార్మికులు పనిచేస్తుండేవారు. 1944 సంవత్సరంలో ఆ ప్రాంతంలో అమ్మవారు తిరుగాడేవారని కార్మికులు అంటున్నారు. 1952లో ఓ రోజు రాత్రి వేళలో పట్టీల శబ్దంతో అమ్మవారు కార్మికులకు కనిపించారని, ఆ తల్లి కోరిక మేరకు ఆ ప్రదేశంలో చిన్నపాటి పూరిపాక నిర్మించి రాతినే అమ్మవారి ప్రతిరూపంగా నెలకొల్పినట్లు చెబుతుంటారు. అప్పటి షిప్‌యార్డ్ కార్మిక నాయకులు పిల్లా వీరన్న, శరగడం అప్పలనాయుడు, పిల్లా అప్పారావు, డిల్లాడ అప్పన్న తదితర కాలనీ పెద్దలు గుడి నిర్మాణానికి నాంది పలికారు. దీంతో అప్పటి షిప్‌యార్డ్ సీఎండీ కమోడోర్ లిల్లీ సహకారంతో అమ్మవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి కార్మికులంతా తమ ఒకరోజు వేతనం విరాళంగా ఇచ్చారు. 1965లో ఆలయ గోపురం, ముందుపెంకుతో మండపాన్ని నిర్మించారు. కాలనీ వ్యాపారులు గూడేల బాబూరావు, మిల్లు రంగబాబు తో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన వారి కుటుంబసభ్యులు అమ్మవారి ఉత్సవాలను ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరిపిస్తుంటారు. షిప్‌యార్డ్‌ను నౌకాదళ రక్షణ రంగంలో విలీనం చేయడంతో ఉద్యోగులు, కాలనీ వాసుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్నేళ్లుగా అమ్మవారి ఉత్సవాలను కాలనీ పూర్వీకులే నిర్వహిస్తున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

సుదీర్ఘ చరిత్ర గల సింధియా మరిడిమాంబ అమ్మవారి పండగ ఈనె 7వ తేదీ ప్రారంభమైంది. గురువారం పండగ ముగింపు మహోత్సవంలో భాగంగా అమ్మవారికి వేకువజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం జాతర మహోత్సవం నిర్వహిస్తారు. అనుపుమహోత్సవాన్ని భారీ బాణసంచా నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అజయ్, కె.లక్ష్మణరావు, జోగారావు ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఇంటి వెలుగు జగనన్నే

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : రాష్ట్రంలో ఏ పేదింటి తలుపు తట్టి ప్రశ్నించినా ఒక్కటే చెబుతారని.. మా ఇంట వెలుగుకు కారణం జగన్ అంటారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు ఉప్పరకాలనీలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు వారి చెంతకే ప్రభుత్వ పథకాలు వస్తాయన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా మధ్యవర్తులు ఉండరన్నారు. గతంలో పింఛన్ పొందాలంటే ఆ నెల ఒకటో తేదీ నుండి పదిహేనో తేదీ వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఒకటో తేదీ తెల్లవారి ఆరు గంటలకే ఇంటికెళ్లి మరీ అర్హులకు పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇలా ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్లు చుక్క వరలక్ష్మి, తోనంగి వెంకటరమణి, పొడుగు రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన వార్డు పరిధి పిలకవానిపాలెంలో కొలువుదీరిన నవదుర్గ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. ఆలయం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా నవదుర్గా అమ్మవారి జాతర మహోత్సవాలు జరిగాయి.



'గడప గడప'కు కార్యక్రమంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఆనంద్‌కుమార్

కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు పురస్కారాలు

మహారాణిపేట : పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు శ్రద్ధ అసోసియేషన్ పురస్కారాలు అందజేసింది. బుధవారం 20 మంది పిల్లలకు ఆర్థిక పురస్కారం, మరో 10 మంది పిల్లలకు కాలేజీ బ్యాగులను సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద ద్వారా అందజేసింది. శ్రద్ధ అసోసియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. సాగర శిరిజ మాట్లాడుతూ శానిటరీ ఉద్యోగుల పిల్లలు, సెక్యూరిటీ ఉద్యోగుల పిల్లలకు నగదు ప్రోత్సాహకాలు, కాలేజీ బ్యాగులు అందజేశామని తెలిపారు. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బి. సమీర్ సౌరభ్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్న పిల్లలకు అవసరమైన సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు బి. జగదీశ్, కేజీహెచ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్. అప్పారావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ

సబ్బవరం: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు అందించడానికి ఈపీడీసీఎల్ నిరంతరం కృషి చేస్తుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ చెప్పారు. సబ్బవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు ,సలహాలు అందించారు. సిబ్బంది అంతా భద్రత ప్రమాణాలు పాటిస్తూ అప్రమత్తంగా పనిచేయాలన్నారు. రెండు రోజుల కిందట వచ్చిన వర్షాలు, భారీ గాలుల వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించడానికి, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి అవసరమైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఈపీడీసీఎల్ డీఈఈ నిరీక్షన్ అంబేద్కర్, ఏఈలు అశోక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ